కథలు

# ఒక జీవితం...
# కొన్ని కలలూ...!

ఆకునూరి హాసన్



ప్రథమ ముద్రణ
మే, 2018

ప్రతులు : 1000

వెల : ₹ 150/-

© సర్వహక్కులు రచయితవి

ఆకునూరి హాసన్
విజయలక్ష్మీపురం ఫస్ట్ లేన్
బాపట్ల - 522 101, గుంటూరు జిల్లా.
మొబైల్ : 98494 27699

ప్రతుల కొరకు :
అన్ని ప్రధాన పుస్తక విక్రయశాలల్లో...

కవర్ పేజి :

బుక్ డిజైన్ : తెనాలి ప్రచురణలు
22-6-78, 2 ఫ్లోర్
లక్ష్మీసదన్, కొత్తపేట, తెనాలి
సెల్ : 9347661122

# కలల క్రమం...


| | | |
|---|---|---|
| 1. | ఎక్కవలసిన రైలు | 9 |
| 2. | వాళ్ళు తిరిగిరారు | 14 |
| 3. | హోటల్ అయ్యరు కూతురు | 23 |
| 4. | నాన్న ఎప్పుడొస్తారు ? | 30 |
| 5. | వలస పక్షులు | 39 |
| 6. | మెరుపు మెరిసింది | 59 |
| 7. | చదువుకున్న మనిషి | 69 |
| 8. | ఎలా మరువను... నిన్ను | 80 |
| 9. | అతడు – ఆమె | 89 |
| 10. | ఒక జీవితం – రెండు కలలు | 104 |
| 11. | గోడమీది పేరు | 112 |
| 12. | ఆరు గజాల జీవితం | 122 |
| 13. | చివరి కాన్క | 130 |
| 14. | వాల్క నో | 137 |
| 15. | క్రీనీడ | 143 |
| 16. | బ్రెయిన్ డెడ్ | 155 |
| 17. | తెరుచుకునే తలుపులు | 163 |
| 18. | ఆమె | 169 |
| 19. | స్వాప్నికుడి స్వప్నం | 179 |

# ఎక్కవలసిన రైలు

పొద్దుటి ఎండ నేలమీద ఏటవాలుగా పరుచుకుంది. ప్లాట్‌ఫారం మీద ఎక్కువ మంది మనుషులు లేరు. ఏదో గూడ్సురైలు చిన్నగా వెళుతోంది. దూరంగా ఎవరో బరువైన ట్రాలీని లాగుతున్నారు. చక్రాలు కీచుమంటూ నిశ్శబ్దాన్ని చీలుస్తున్నాయి.

సన్నగా వీచే గాలి ఉండుండి పార్సిల్ ఆఫీస్ ముందు పేర్చిన గంపల్లోంచి రొయ్యల వాసన మోసుకొస్తోంది. అతడు ప్లాట్ ఫారం మీది కొచ్చి ఏదో ఆలోచిస్తూ చుట్టూ చూశాడు. కాస్త దూరంగా ఓవర్ బ్రిడ్జి పక్కనే గంగరావి చెట్టుక్రింద బెంచీమీద కూచొని ఉన్న ఆమె కనిపించింది. నేలమీద సామాన్లు ఉన్నాయి. పక్కనే అయిదారేళ్ళ పిల్లాడు అమాయకంగా చూస్తూ కూచున్నాడు.

ఆమెని చూసిన వెంటనే అతను ఉలిక్కి పడ్డాడు. అనుమానంగా గుచ్చి గుచ్చి మరీ చూశాడు.  గుండెతీసి చేతిలో పట్టుకుని చూస్తున్నట్లుగా. ఆమె కూడా అతన్ని చూసింది. అతని చూపుల్ని అతి కష్టం మీద తప్పించుకుంటూ చూసింది. అలా చూసేకొద్దీ అతను బాధపడ్డాడు. ఏదో తెలీని ఆరాటానికి లోనయ్యాడు. అతన్ని చూసి ఆమె కలవరపడింది. భయపడలేదు కానీ – ఏ మూలో కాస్త అసహ్యం వేసింది. మనసులో ఏవో జ్ఞాపకాలు ఒక్క పెట్టున కదిలినట్లయి – అలజడిగా అనిపించింది.

ఫెన్సింగ్ అవతల యూకలిప్టస్ చెట్లు – ఏనాటి విషాద సంఘటనలకో నిల్చిన సాక్షీభూతాల్లా గాలికి విసురుగా ఊగుతున్నాయి. దక్షిణపు గాలి అతనిలో ఎప్పటి స్మృతుల్నో లాగికొడుతోంది. అతని చేతిలోని బ్రీఫ్ కేస్ బాధల్ని నింపుకున్న హృదయంలా బరువెక్కింది. అలాగే చూస్తూ సందిగ్ధంగా నిలబడ్డాడు. పిల్లాడు ఏదో అడుగుతున్నాడు. ఆమె అన్యమనస్కంగా ఏదో చెప్పింది.

అతను ఉండలేక ఇక బెంచీవైపు నడిచి దగ్గరికి వెళ్ళి నిలబడ్డాడు. ఆమె అతన్ని పట్టించుకోకుండా తల తిప్పుకుంది. తలతిప్పుకుందన్న మాటేగానీ – కళ్ళు మాత్రం అతన్ని గమనిస్తూనే ఉన్నాయి. రైల్వే పోర్టర్ వీళ్ళనే చూస్తూ వెళ్తున్నాడు. దూరంగా ఇద్దరు బిచ్చగాళ్ళు ఒకళ్ళని ఒకళ్ళు తిట్టుకుంటున్నారు. ప్లాట్ ఫారం మీద ఎక్కువ మంది మనుషులు లేరు. అతనికి ఏం చెయ్యడానికి తోచింది కాదు.

ఆమె కాళ్ళ వైపు చూశాడు. ఆకుపచ్చటి చీరలోంచి లేత తమలపాకుల్లాంటి పాదాలు కనిపిస్తున్నాయి. కాలివేళ్ళకి వెండి మెట్టెలు. శంఖంలాంటి మెడ, మెళ్ళో నల్లపూసల గొలుసు. పాపిట్లో ఎర్రగా సింధూరం. నల్లటి బారైన జడ.... నున్నటి చెంపలు... పెదవులూ.....

ఆమె కళ్ళ చివర్లనించి అతన్ని గమనించింది. కాళ్ళకి ఆకు చెప్పులు వదులుగా ప్యాంట్, కొద్దిగా మాసిన గడ్డం. లోతుకి పోయిన కళ్ళు. కళ్ళకింద నల్లచారలు. దళసరి కళ్ళద్దాలు, చెంపల్లో ఒకటీ అరా తెల్ల వెంట్రుకలు. అతనికి ముళ్ళమీద నిలుచున్నట్లనిపించింది. పూడుకుపోయిన గొంతుని సెకిలించుకున్నాడు. "బాగున్నావా?" అన్నాడు. మాట పడిపోయిన వాడికి మళ్ళీ మాటలు వచ్చి మాట్లాడుతున్నట్లుగా.

ఆమె పలకలేదు. పట్టించుకోనట్లుగా, తనని కాననట్టుగా ఉండిపోయింది. ఏమీ చెయ్యడానికీ తోచింది కాదు. పక్కన పిల్లాడు తల్లిముఖంలోకి ప్రశ్నిస్తూ చూశాడు. ఆమె చెంగు చివర్లని వేలికి చుట్టుకుంటూ, పట్టాలకవతల పేర్చిన చెక్క స్లీపర్ల వైపు చూపుల్ని మరల్చుకుంది. అతను మాటలు కొనసాగించాడు.

"ఎన్నాళ్ళయింది.. నిన్ను చూసి... గుర్తున్నానా? ఇపుడు ఎక్కడుంటున్నావు ? మీ వాళ్ళు ఎవరూ రాలేదా ? ఎక్కడి దాకా ప్రయాణం.. కొడుకా ?.... నువ్వు... బాగున్నావు కదా... అది చాల్లే..." ఆ మాటలు ఆమె వింటుందో ? లేదో ?

# హోటల్ అయ్యరు కూతురు

అయిదొందల గడప ఉండే అగ్రహారంలో నిన్న మొన్నటి వరకు శేషగిరి టిఫెన్ హోటల్, ప్రేమమ్మ భోజనం హోటల్ మాత్రమే ఉండేవి.

కర్నూలు రోడ్డులో చుట్టుపక్కల ఏడెనిమిది గ్రామాలకి కూడలి ప్రాంతంగా ఉన్న అగ్రహారానికి పదిమైళ్ళ దూసరంలో టౌన్ ఉండడంతో సినిమాలకీ, ఇతర పనులకీ వెళ్ళే గ్రామాల ప్రజలు తప్పనిసరిగా అగ్రహారం సెంటర్లో రోడ్డు పక్కన కాసేపు ఆగి పైనించి వచ్చే బస్సుల్లో టౌన్‌కి వెళ్తుంటారు.

మొయిన్ రోడ్డులో కాకుండా రామమందిరం వీధిలో మెడికల్ డిస్పెన్సరీ దగ్గర మూడు రోడ్ల కూడలిలోని పెంకుటింట్లో కోమటి శేషగిరి హోటల్, ప్రొద్దుట ఇడ్లీలు, కొబ్బరి, సెనగపప్పు పచ్చడి, ధనియాలకారం, ఉల్లిగడ్డ–పచ్చిమిరపకాయలు – చింతపండుతో కచ్చాపచ్చాగా నీళ్లచెట్నీ. ఊకపొయ్యి పెనం మీద అటు మందంగా, ఇటు పల్చగా కాకుండా మధ్యస్తంగా అక్కడక్కడ చిల్లుల్తో లోపలివైపు ఉల్లి, మిర్చి ముక్కలు వేసి ఓ వైపు మాత్రమే ముదురు ఎరుపుగాకాల్చే మినపట్లు, మధ్యాహ్నం మూడు తర్వాత ప్రొద్దుట మిగిలిపోయిన దోశపిండి, ఇడ్లీపిండిలో ఉల్లిపాయ, మిర్చి ముక్కలు కలిపి నూనెలో దేవిన పునుగులు, ఉల్లిపకోడి, టీలు, కాఫీలూ, ఇలా శేషగిరి హోటల్ పర్మినెంట్ మెనూకి అగ్రహారం ప్రజలు కూడా ఇన్నాళ్ళూ బాగా అలవాటు పడిపోయారు.

ఆదివారాలు, సెలవరోజుల్లోనైతే కోటంశెట్టి మనవడు శేషగిరీ, పోస్ట్‌మేన్ సూర్యనారాయణ కొడుకు ప్రభు, డాక్టరు గారి బాబు, ఆయిల్‌మిల్లు గురవయ్య గారి ఆఖరి కొడుకు కన్నయ్, చాక్లెట్ పంతులు చిన్నపిల్ల సుబ్బమ్మతో సహా చాలామంది స్కూలు పిల్లలు ఉదయాన్నే శేషగిరి హోటల్‌కి వైరుబుట్టతో వచ్చి మరీ ఇడ్లీలు, దోశలు పార్సెల్ చేసి తీసుకెళ్లేవాళ్ళు.

సరిగ్గా ఇలాంటి సమయంలో టౌన్‌కి వెళ్ళే కర్నూలు రోడ్డులో ఆర్టీసి ప్రైవేటు బస్సులు ఆగే రామారావు బట్టలకొట్టుకి పది ఇళ్ల తర్వాత ఎడమపక్కనున్న పాతకాలపు పెంకుటింట్లోకి ఓ మధ్యాహ్నంపూట మినీ లారీలో అయ్యరు కుటుంబం దిగబడిపోయింది.

రంగూన్ టేకుతో చేసినట్లున్న నల్లటి చెక్క బల్లలు, వాటిమీద పాలరాయిలాంటి ఏకరాయిని బిగించినవి. అచ్చంగా అలాంటివే ఓ పది కుర్చీలు. రోలు, అల్యూమినియం గిన్నెలు, జగ్గులు, స్టీలుగ్లాసులు. ఇంకా ఏమిటేవిటో అన్నీ ఆ మినీలారీలోంచి దింపుకున్నారు. అయ్యరు, భార్యా, పెళ్ళికి వయసుదాటి చాలారోజులయినట్లుగా నందివర్ధనం లాంటి కూతురూ, పొట్టిగిత్తలాగా నిక్కరులోకి చొక్కాని టక్‌చేసి స్టైల్ కొట్టే కొడుకూ.

ఆ మరుసటి రోజే పెంకుటింటి ముందు రెండు కర్రలు దిగేసి పెద్ద బోర్డు దానిమీద "అయ్యరు హోటల్" అనే అక్షరాలు.

అగ్రహారంలో కొత్త హోటల్ వెలిసింది.

ప్రొద్దుటే ఫస్ట్‌బస్ వెళ్ళే టైమ్‌కి ఇడ్లీలు, సువాసనలు వెదజల్లే మద్రాసు సాంబారు రెడీ అయిపోయాయి.

కనిగిరి నుంచి వచ్చిన ఫస్ట్ బస్సుని మామూలుగా రామారావు బట్టలు కొట్టు ముందు ఆపబోయిన డ్రైవర్‌కి వరుసగా రెండు లారీలు అడ్డం వుండేసరికి కాస్తంత ముందుకి తీసుకెళ్ళి ఆపాల్సి వచ్చింది.

సరిగ్గా రెండిళ్ళ అవతల 'అయ్యర్ హోటల్' అనే బోర్డు కనిపించడంతో సీట్లోంచి క్రిందకి దిగిన డ్రైవర్ అప్పారావు "రాముడూ కొత్త హోటల్ పెట్టార్రోయ్" అంటూ అప్పటికే ఆ చుట్టుపక్కల వ్యాపించిన మెడ్రాస్ సాంబార్ ఘుమఘుమల్నీ ముక్కుకి

# ఎలా మరువను... నిన్ను

"ఆ గదిలోకి వెళ్ళి ఎంతో కాలమైంది. జీవితం దిగులుగా, ఒంటరిగా అనిపించిందివాళ. అందుకే ఆ తలుపులు తీశాను. చెదలుపట్టి తుప్పెక్కి బిగుసుకున్న, కిర్రుమనే చప్పుడుతో తెరుచుకున్న ఎప్పటి తలుపులో, ఎప్పటి తలపులో, గదిలో గూడుకట్టిన చీకట్లోంచి ఎటువైపు నుంచో సన్నని వెలుగురేఖ ప్రసరిస్తోంది. ఆరోజు.... నువ్వెలిగించిన అగరబత్తీ పరిమళం ఇంకా అంటిపెట్టుకునే ఉన్నట్లుంది.

నేలమీది దుమ్ములో నా నీడ నల్లగా, పొడుగ్గా పరుచుకుంది. కాలం ఎందుకింత బలీయమైందో ఇప్పటికీ అర్థం కావడం లేదు. యుగాల్ని, రాజ్యాల్ని చరిత్రలో ఎన్నిటినో తనలో కలుపుకుని మాయం చేసిన కాలం నిన్ను, నీ జ్ఞాపకాల్ని, నీ గుర్తుల్ని అయినా మిగులుస్తుందా ? ప్చ్! పోనీలే. భౌతికంగా ఎలాంటి గుర్తులూ లేక పోతేనేం. నా హృదయం లేదూ... పిచ్చి హృదయం. ఇంకా అది ఆ వెర్రి నమ్మకం తోనే వెలుగుతోంది. నువ్వు ఎప్పటికైనా తిరిగి వస్తాననే నమ్మకమే లేకపోతే నేను ఏమైపోయేవాడినో??

గదిలోకి అడుగు పెట్టగానే, మాసిన గోడకి తగిలించిన ఫోటోలో నువ్వు. నీ పెదవులమీద చెక్కు చెదరని అప్పటి చిరునవ్వే. 'బాగున్నావా?' అని నీ కళ్ళు దిగులుగా అడిగినట్లే అనిపించింది.

ఊగేసాలెగూళ్ళ వెనకనుంచి అస్పష్టంగా నీ రూపం. కన్నీళ్లు చివ్వున చిమ్మాయి. మూసిన కిటికీ తలుపులు వెనకనుంచి కొబ్బరాకులు శబ్దం చేస్తున్నాయి. బయటెక్కడో ఏదో పిట్ట విషాదంగా అరుస్తోంది. దిగులు జీవితాన్ని పట్టి బంధించాలని ప్రయత్నిస్తోంది. విషాదం పొగమంచులాగా ఆవరించుకుంటోంది.

వాడి, ఎండిన మల్లెపూలూ, రాస్తూ రాస్తూ మధ్యలోనే ఆపేసిన ఏవోకాయితాలూ, పాళీ ఎండిన పెన్ను, తలదువ్విపడేసిన దువ్వెనా, ఆ మంచం మీద రెక్కలు తెగిన పావురాల్లా, శిథిలమవుతున్న జ్ఞాపకాల శకలాల్లా ఉన్నాయి. గదిలోని మనస చీకటిని పోగొట్టాలని లైటు వేయబోయాను. కానీ, నాచెయ్యి మధ్యలోనే ఆగింది. 'నువ్వు లేవు' అని నిర్ధారణగా తెలిపి గుండెని విషాదంతో మెలిపెట్టే వెలుతురుకన్నా, నువ్వెక్కడో ఈ గదిలోనే ఏ నీలినీడ మాదిరిగానో ఇంకా మిగిలే ఉన్నావు అనే చిన్నపాటి ఆశ, తృప్తి కలిగించే, అస్పష్టమయిన చీకటే నయం కదూ!!

ఇంతలో ఉన్నట్టుండి చిన్నగా వీచిన గాలికి వెనక నుంచి తలుపు చట్టున మూసుకుపోయింది. నీలమీద పరుచుకున్న నా నీడ నీలాగే ఫక్కున నవ్వి, చీకట్లో కలిసి మాయమైంది"

✧ ✧ ✧

"ఈ రోజు కూడా నీ ఉత్తరం రాలేదు. ఎందుకో తెలీడం లేదు. హృదయం మాత్రం 'నువ్వుకావాలి' అని మూగగా రోదిస్తోంది. పచ్చికమైదానం నిర్జనంగా బావురుమంటోంది. వర్షపునీళ్ళు గాలికి చలిస్తున్నాయి. దూరంగా కొండలు ఏకాంతం ఏర్పరచిన కోటగోడల్లా కనిపిస్తున్నాయి. ఇక ఇంతేనేమో ? నువ్వు రావేమో ?? సందేహాల్ని, ఖేదాల్ని, ఖేదాల్ని ఛేదించుకుని పరధ్యానంగా అప్పటి దారిలో నడిచి వెళ్తుంటే దారి వెంబడి పువ్వుల పరిమళంతో కలిసి గుండెని పట్టుకుని ఆపాయి నీ జ్ఞాపకాలు. అడుగు ముందుకి పడలేదు. ఊరికే నిలబడిపోయాను.

దూరంగా పొలాలమధ్య ఎవరివో ఇళ్ళు కనిపిస్తున్నాయి. తెలిసిన వాళ్లెవరూ ఉండరు. ముఖ్యంగా నువ్వు. అంతా కొత్తవాళ్ళు. కొత్త ప్రపంచం వింతగా చూసి "ఆమె వెళ్లిపోయిందిగా, మళ్ళీ ఎప్పుడు వస్తుంది?" అని అడుగుతున్నారు. వాళ్లకి

# ఒక జీవితం – రెండు కలలు

అలారం మోగుతుంటె రోజులాగే పొద్దుటే అయిదు గంటలకు కళ్ళు తెరిచి, మంచం పక్కని డ్రెస్సింగ్ టేబుల్ మీదున్న సెల్‌ఫోన్‌లోని అలారంని ఆఫ్‌చేసి కిటికీలోంచి బయటకి చూశావ్.

తూర్పు ఆకాశంలో వెలుతురు చార.

తడి ఆరిన కళ్ళు వేళ్ళతో నలుపుకుంటూ లేచి కూర్చుని కాళ్ళు చల్లటి ఫ్లోర్‌మీద ఆనించి... ఎదురుగా అద్దంలో చూసుకుంటే – రేగిన జుట్టు ఎరుపెక్కిన కళ్ళు, ఉబ్బిన రెప్పలూ, మెరిసే బుగ్గలూ... వారం రోజుల క్రిందటి హెయిర్ కలర్ వదిలించుకుంటూ చెంపల్లో తెల్లగా నవ్వుతున్న వెంట్రుకలు.

కొత్తరోజులోకి కళ్ళు తెరిచి, తొంభై కిలోల దేహాన్ని జీవితంలోకి కాస్తంత ముందుకి నెట్టబోయే ముందు మొట్టమొదట నీ ముఖాన్ని అద్దంలో ప్రేమగా చూసుకోవాలని కొన్ని పదుల ఏళ్ళ కిందటే ఎవరన్నా చెప్పారా నీకు ?

ఇప్పుడు నీ ముఖం ఇంత ఉదయాన్నే చూసుకుంటుంటే.... నీకిప్పుడు జీవితం నిస్సారంగా శూన్యంగా, ఓట్ మీల్‌లా చప్పగా ఎందుకు అనిపిస్తుందో నువ్వు ఎప్పుడైనా ఆలోచించావా ?

ఇది నీ జీవితంలో మళ్ళీ ఉదయించిన, ఎలాంటి నూతనత్వం లేని సరికొత్త రోజని నీకు ఈ రోజు కూడా తెలుసు. కేలండర్లో ప్రతి పేజీలో కనిపించే అవే అంకెల్లా ఏ మార్పు లేకుండా కనిపించే నీ ముఖం కాలెండర్ లాంటిదని ఎవరో నీతో అన్నారు గానీ... నీ జీవితమే ఏ మార్పు లేని పేజీలతో ఒకే విధంగా ఉంటుందని... నీకెందుకు తెలీదూ ??

ఎప్పుడో తెల్లవారుజామున మాగన్ను నిద్రలో దిండు మీంచి పక్కకి వొత్తిగిలి కుడి చేతిని పొడవుగా చాచినపుడు రెండో మనిషంటూ లేని ఒంటరి జీవితంలా చల్లటి, మెత్తటి పరుపు చేతికి తగిలినపుడు నీకు జీవితం, జ్ఞాపకాలు, కలలూ గుర్తొస్తుంటాయనీ, అప్పుడు నీ గుండెలో కెరటం లాంటి దిగులుతో కూడిన దుఃఖపు అలేదో ఎగిసిపడుతుందనీ నువ్వెవరికీ చెప్పవు.

చివరికి రజనీగంధకి కూడా...

గత నాలుగేళ్ళుగా నీ మనసుని అనేక రకాలుగా ప్రభావితం చేసి నీ ఒంటరి జీవితపు ఏకాంతాన్ని... సమూహంతో, మాటలతో అమాంతం ఆక్రమించుకున్న నలభైమూడేళ్ళ రజనీగంధకి నీ మనసు లోతుల గురించి ఎప్పుడన్నా చెప్పావా ? తను కూడా నీ లాగే ఒంటరిగా జీవిస్తున్న నీకన్నా అయిదారేళ్ళ చిన్నదైన స్త్రీ అయినా సరే... చెప్పలేదు కదా నువ్వు !!!

అసలు ఎవరైనా తమ మనసు లోతుల గురించి ఎవరికైతే తప్పనిసరిగా చెప్పాలో.... వాళ్ళకి ఎప్పటికప్పుడు సరైన సమయానికి ఆప్‌డేట్‌లా చెప్పుకుంటూ పోతే చాలా జీవితాలు ఎంతో కుదుపుకీ, మార్పుకి గురవుతాయని నీకు తెలీదా ?

తెలీదు అనేకంటే నీకు తెలుసుకోవాలి అనే ఇష్టం అంతగా లేదు. ఎందుకంటే అది నీకు అంత అవసరం కాదు కాబట్టి.

లేకపోతే ఈ నలభై తొమ్మిదేళ్ళ వయసులో కొద్దో గొప్పో జీవితానికి దగ్గరైనట్లుగా భావిస్తున్న రజనీగంధకే కాదు... ఎప్పుడో ఇరవైనాలుగేళ్ళ కిందటే నీ పాతికేళ్ళ వయసులోనే మాధవికి చెప్పి ఉండేవాడివి. అప్పుడు మాధవికి ఇచ్చేయగా మిగిలిన సగం జీవితం ఇలా ఉండేది కాదని, ఒక్క వెలుగు వెలిగి ఉండేదని నీకు తెలుసు.

# ఆరు గజాల జీవితం

పూరింటి మీదనించి గిరికీలు తిరుగుతూ కొడుతోంది చలిగాలి. గాలికి తాటాకులు చిన్నగా శబ్దం చేస్తున్నాయి. పంచలోగుంజకి ఆనుకుని కూచొని శూన్యంలోకి చూస్తున్న వరలక్ష్మి....

"అమ్మా... ఆకలే..." అంటూ చెంగు పట్టుకుని లాగిన నాలుగేళ్ళ కొడుకు వైపు తల తిప్పి చూసింది.

పేడతో అలికి చాలా రోజులయిన మట్టి నేలమీద ఓపిక లేనట్లుగా నీరసంగా కూచుని వున్నాడు పోతరాజు.

పోతరాజుకి నాలుగేళ్ళంటే ఎవరూ నమ్మరు. లివర్ వ్యాధి బాగా ముదిరినట్లుగా శరీరానికి మించి ఉబ్బిపోయిన పొట్ట.

పీక్కుపోయిన ముఖంలో వెళ్ళుకొచ్చి నట్లుండే దవడలూ, ఎప్పుడూ దేన్నో వెతుకుతున్నట్లుండే కాంతి నశించిన కళ్ళూ... చింపిరి జుట్టూ.

పౌష్టికాహారం లోపించి సరైన ఎదుగుదల లేకుండా – గిడసబారిన వెంపలి చెట్టులాగా పోతరాజు.

వరలక్ష్మికి ఏం సమాధానం చెప్పాలో తోచలేదు. ఒకవేళ ఏదో ఒకలాగా నచ్చచెప్పినా వాడు ఊరుకోడనీ తెలుసు. అయినా పరిస్థితుల గురించి వాడికేం తెలుసు.

"నాకు మాత్రం – పదేళ్ళనాడు... అమ్మా, నాన్న బాధపడటం ఎలాగో నేర్చుకోవడాన్ని ఆ రోజుల్లోనే మొదలుపెట్టారని... నాకు మాత్రం అప్పుడేం తెలుసు" అనుకుంది వరలక్ష్మి.

"అమ్మా... అన్నమే...." పూచిక పుల్లల్లాంటి కాళ్ళని నేల మీద కొడుతూ ఏడుపు అందుకున్నాడు పోతరాజు.

ఈవూరుపాలెం మీద నిశ్చలంగా నిలబడివున్న ఆకాశం నీలంగా వుంది.

ఊళ్ళోని ప్రతి ఇంటిమీద బాగా ఎండిన తాటాకులు నల్ల డాగుల్తో, తెల్ల తెల్లగా అసహ్యంగా వున్నాయి.

ఊరంతా నిశ్శబ్దంగా వుంది. ఇళ్ళలోని మగ్గాలు – ఏడుపుని దిగమింగుకుని, కళ్ళు మూసుకున్నట్లున్న శవాల్లా అచేతనంగా పడివున్నాయి. ఊరు... మూకుమ్మడి చావుల్ని చూసిన శ్మశానంలా, విషాదం మూర్తీభవించినట్లుగా తెలీని భయాన్ని కలిగిస్తోంది.

చలిగాలి విసురుగా వీచింది. రోడ్డుమీది చెత్తా చెదారం గాలికి లేచొచ్చి పంచలో పరుచుకుంది.

కొర్రుపట్టిన ముతక నేతచీరని భూజాల చుట్టూ కప్పుకుంది వరలక్ష్మి.

"ఆయన ఏడకెళ్ళాడో ?" ప్రొద్దుటనగా బయటకెళ్ళిన భర్త రత్తయ్యని తలుచుకుంది. ఆర్నెల్లబట్టి పని అనేది ఎరక్కుండా మగ్గాన్ని మూతబెట్టి... సంసారం గడవడం కోసం అందినచోటల్లా అప్పులు చేస్తూ అందని చోటల్లా అడుక్కుంటూ... క్రమంగా ఊబిలో దిగబడుతున్న రత్తయ్య.

రత్తయ్య గుర్తుకి రాగానే వరలక్ష్మి కళ్ళలో నీళ్ళు చిమ్మాయి.

రొమ్ముమీద ఎముకల గూడు కనిపిస్తూ లోతుకి పోయిన పొట్ట, చలికి పగిలి, తెల్లటి పొట్టు, రేగిన సన్నటి బలహీనమైన కాళ్ళూ, చేతులూ పీక్కుపోయిన చెంపల్ని పూడ్చే మాసిన గడ్డం.

దిగుడు బావుల్లా నీటి చుక్క అనేది లేకుండా ఎండిపోయి, లోతుకుపోయి, ఏలోకంలోకో దిగులుగా, భయంగా ప్రాణాల్ని గుప్పెట్లో పెట్టుకున్నట్టు చూస్తుండే... ఆ గాజు కళ్ళు.

# క్రీనీడ

లైబ్రరీ గోడలు తెల్లగా, దిగులుగా ఆకాశంలోకి ఎదిగిపోయే ఆశల్లా– అశోకచెట్లు పచ్చగా ఉన్నాయి. యూకలిప్టస్ చెట్లు బరువుగా ఊగుతున్నాయి. చెట్ల నీడలు దారినిండా పరుచుకున్నాయి. ఆకులు కుళ్ళిన ఏదో వాసన ఈ పురాతన బోస్ బిల్డింగ్ దగ్గర.

"హలో!" ఎదురుగా మోహిని – మోహనంగా నవ్వుతూ.

బదులుగా ఒక నవ్వూ. ఒక హలో"

"ఇ టెక్కడికి?"

"నేనా ?"

అవును, ఎక్కడికి ? "ఏవీ తోచక, ఎక్కడా ఉండలేక, అలా కాసేపు నడుద్దామని..." సన్నగా గొణిగి, మిగిలిన మాటల్ని నాలిక కింద దాచి మింగేశాను.

"నేనూ అంతే పద. అలా వెళ్దాం"

నువ్వూ అంతేనా ? ఇంత అందం, సొగసు, కవ్వించే కళ్ళూ, జివ్వనిపించే వొళ్ళు – గుండెని నమిలి మింగే నీ మాటలూ... ఇన్ని ఉన్నా నీకు.... నువ్వూ ఏకాకివేనా ? నీకూ నాలాంటి దిగులేనా మోహినీ ? నిజంగా నన్ను నమ్మమంటావా ?

అలా నడుస్తూ ఓల్డ్ క్యాంటీన్ దాటాం.

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Oka+Jeevitam+Konni+Kalalu**

* * *